క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

తెర్లాం: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ జె.త్రినాధరావు ఆవిష్కరించారు. మండలంలోని పెరుమాళి ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ సమావేశం ఆ సంఘం జిల్లా కార్యదర్శి భోగి జయకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓతో పాటు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు కలిసి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. హెచ్‌ఎం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

తెర్లాం: గృహ సారథుల శిక్షణ కార్యక్రమం తెర్లాంలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం(రామకృష్ణ థియేటర్)లో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జరగనుంది. ఈ మేరకు మండల పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. జేసీఎస్ మండల కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్, వైస్ ఎంపీపీలు, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహ సారథులంతా తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఉపాధి పని కల్పిస్తాం..



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: వలసలు వెళ్లకుండా గ్రామంలోనే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ఉపాధి హామీ పనులలో జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ ఉపాధి పని కల్పిస్తామని ఎంపీడీఓ రమామణి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ఏపీఓ సుశీల, మిగతా ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. గ్రామాల్లో ఉపాధి పనులపై ఆరా తీశారు. గ్రామాలలో క్షేత్ర సహాయకుల ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. జాబ్ కార్డు ఉంటే పనులు అడిగిన వెంటనే కల్పిస్తామన్నారు. వేతనదారులకు ఇచ్చిన కొలతల ప్రకారం తవ్వాలని, అలా అయితేనే పూర్తి వేతనం పడుతుందన్నారు.

మూగజీవాలకు పీపీఆర్ టీకాలు

బాడంగి: గొర్రెలు, మేకలలో సంభవించే పీపీఆర్ వ్యాధి(చీడపారుడు) నివారణకు టీకాలు వేస్తున్నట్టు పశు వైద్యాధికారులు వి.గోవింద్, రాధిక చెప్పారు. కోటిపల్లి, బాడంగి గ్రామాల్లో సుమారు వెయ్యి జీవాలకు పీపీఆర్ టీకాలు గురువారం వేశారు. మండలానికి 16,500 టీకా డోసులు వచ్చాయని, నాలుగు నెలలు నిండిన వాటికి ఈ టీకాలు వేస్తామన్నారు. ఈ నెల 28 వరకు అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు వినియోగించుకోవాలని సూచించారు. పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

రూ.257లు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న వేతనదారులకు రోజుకు రూ.257లు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. తెర్లాంలోని చింతల చెరువు, జగ్గారావు చెరువు, తాండ్రోడు బందలలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లు, పనులను, వేతనదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ వేతనదారులంతా ప్రతీరోజు రెండు పూటలా ఉపాధి పనులు చేస్తే రూ.257ల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. గురువారం మండలంలోని కొప్పరవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి సిబ్బంది, విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా అడిగితెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనూష పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



లచ్చారాయపురంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని లచ్చారాయపురం, జాడపేట గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ ఏ ఒక్క పథకం అమలు చేయడం ఆగలేదన్నారు. ఇదే ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూపించే దమ్ము, ధైర్యం ఎల్లోమీడియాకు లేదన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని, ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా దీవించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పొండ్రంకి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు వావిలపల్లి వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పూనువలసలో గ్రౌండ్ ట్రూథింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వేకు సంబంధించి మండలంలోని పూనువలస గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు గురువారం పరిశీలించారు. గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సర్వేయర్లు సరిహద్దులు గుర్తించినప్పుడు చుట్టుపక్కల పొలాలకు చెందిన రైతులను దగ్గర ఉంచి సర్వే చేయాలన్నారు. సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని, వీలైనంత వేగంగా సర్వే పూర్తి చేయాలని సచివాలయ సర్వేయర్లకు తహసీల్దార్ తెలిపారు. భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తెర్లాం డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని నెమలాం పంచాయతీ ఆర్.గడబవలసలో గురువారం గ్రామసభను నిర్వహించారు. మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, వీఆర్‌ఓ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం



గ్యాస్ ఏజెన్సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామం వద్ద పార్వతీ ఎంటర్ ప్రైజెస్ గో గ్యాస్ ఏజెన్సీని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి గురువారం ప్రారంభించారు. రాజాం పట్టణ వాసులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఈ ఏజెన్సీ అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. గ్యాస్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో చాలా ఏజెన్సీలు వస్తున్నాయని, వీటి వల్ల వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. అన్నిరకాల ప్రజారోగ్య కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, సర్పంచ్ ఎల్.రమాదేవి, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, పార్వతీ ఎంటర్ ప్రైజెస్ గో గ్యాస్ ఏజెన్సీ యజమాని ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

- ఎమ్మెల్యే శంబంగి



ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: గ్రామాలలో ఎల్లవేళలా ఆధ్యాత్మిక వాతావరణం ఉంటే సుఖసంతోషాలు నెలకొంటాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని శీతయ్యపేట గ్రామస్తులు నూతనంగా నిర్మించిన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ బోను రమాదేవి, మాజీ సర్పంచ్ చుక్క వెంకటరమణ, చింతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

రాజాం: మండలంలోని కంచరాం, బొద్దాం గ్రామాల్లో చిరుధాన్యాల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఏడీఏ కె.చంద్రరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా పంటమార్పిడి జరిగి నేలసారవంతమవుతుందన్నారు. అలాగే అతి తక్కువ కాలంలో చిరుధాన్యాల పంట చేతికి వచ్చి, అధిక లాభాలనిస్తుందన్నారు. అనంతరం రాయితీపై పలువురు రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. వర్షిణి, సర్పంచ్ ఎస్.రాజు, వ్యవసాయాధికారి రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.257 వేతనం

రాజాం సిటీ: మండలంలోని నందబలగ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ కె.సాయిరాం కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం వస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని, పనుల్లో లేని వారికి మస్తరు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సక్రమంగా డంపింగ్ యార్డు నిర్వహణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని గార్రాజుచీపురుపల్లి వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెత్తను తరలించే విధానం, తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై ఆరాతీశారు. అన్ని వార్డుల్లో గ్యాంగ్ వర్క్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ వీఆర్‌ఓలతో సమావేశమైన ఆయన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. ఆయన వెంట మేనేజర్ ఎంవీ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహసారథుల నియామక ప్రక్రియ పూర్తి

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొబ్బిలి నియోజకవర్గ గృహసారథుల నియామక ప్రక్రియ పూర్తి చేసినట్టు జేసీఎస్ కన్వీనర్లు తెలిపారు. గృహసారథుల జాబితాను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, బొబ్బిలి మున్సిపాలిటీ, మండల, బాడంగి, రామభద్రపురం, తెర్లాం జేసీఎస్ కన్వీనర్లు రేజేటి ఈశ్వరరావు(విస్సు), తమ్మిరెడ్డి దామోదర్‌రావు, మరిపి శంకర్రావు, చింతల సింహాచలంనాయుడు, చేపేన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గృహసారథుల జాబితాను ఎమ్మెల్యే శంబంగికి అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డు, సత్యనారాయణపురం, మాధవబజార్, తెలగవీధి, డోలపేట, మారుతీనగర్, పొనుగుటివలస ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు డీఈఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని, పట్టణంలోని కూరాకుల వీధిలో రామలింగేశ్వర స్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎం.హరగోపాల్‌శర్మ, జీసీసీ ఎండీ జి.సురేష్‌కుమార్, బి.వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురంలో శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 80వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం అన్నదానం చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చాలామంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

అశ్వ వాహనంపై వేణుగోపాలుడు



బొబ్బిలి పురవీధుల్లో అశ్వవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి గురువారం రాత్రి పట్టణంలోని భక్తులకు కనువిందు చేశారు. స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి నుంచి రోజుకో వాహనంపై స్వామి వారు ఊరేగుతారని పురోహితులు తెలిపారు.

నేడు గృహసారథులతో సమావేశం

మెంటాడ: మండలంలోని చల్లపేట గ్రామంలో శుక్రవారం గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు గురువారం తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు

రాజాం సిటీ: భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలోని బొద్దాం గ్రామంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. రామాలయ కమిటీ, గోవిందస్వామి మేలుకొలుపు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో యువతులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని, వివిధ రంగవల్లులతో ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అర్హులందరికీ భూ హక్కు పత్రాలు అందిస్తాం

- డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటేశ్వరరావు



కొర్లవలసలో రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు

రేగిడి: ఇనాం భూములకు సంబంధించి, మండలంలోని కొర్లవలస గ్రామంలో అర్హులైన ప్రతీ రైతుకు భూహక్కు పత్రాలు అందజేస్తామని డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం గ్రామంలోని రైతులతో సమావేశమైన ఆయన ఇనాం భూముల సాగు వివరాలపై ఆరాతీశారు. ఈ క్రమంలో 826.74 ఎకరాల్లో 611 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని తెలిసింది. వీటికి సంబంధించి, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు ఇప్పుడు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేసే భూముల రీసర్వేతో పరిష్కారమవుతోందన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులతో ఈ సమావేశమైనట్లు ఆయన పేర్కొన్నారు. భూములు సాగు చేసే రైతులంతా వారి వద్ద ఉన్న హక్కు పత్రాలను వారం రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయానికి అందజేయాలన్నారు. వాటిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, సర్పంచ్ బి.చంద్రశేఖర్, అడ్వకేట్ ఐ.శ్రీరాములునాయుడు, ఎంపీటీసీ బి. హరనాథరావు, వీఆర్‌ఓ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రూ.12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజి నిర్మాణం



గొడౌన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గొడౌన్‌ను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇదేచోట మరో రూ.12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజి భవనం నిర్మిస్తామని తెలిపారు. దాదాపు రూ.కోటి వ్యయంతో చేస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తికావచ్చిందన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి కొత్త భవనాలు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల ద్వారా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎల్.త్రినాథ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ జయకృష్ణ

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ జయకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని మజ్జిరాముడుపేట ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తరగతుల వారీగా అమలు చేస్తున్న ఎల్‌ఐపీ ప్రోగ్రాంను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామినాయుడు, లక్ష్మీనారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై నిరసన



రామభద్రపురంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఉపాధి వేతనదారులు

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయానికి, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి తక్కువ మొత్తంలో బడ్జెట్ కేటాయించిన తీరుపై సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఉపాధి వేతనదారులు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.30 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. వ్యవసాయానికి, ధాన్యం కొనుగోలుకు బడ్జెట్‌లో తగ్గించడం రైతాంగాన్ని ఇంకా దివాలా తీయించే చర్యలా ఉందన్నారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. రైతులు, వేతనదారులు పోరాటాలకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవ్వా ధర్మారావు, చింత ఆదినారాయణ, అలమండ దివ్య, రేజేటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గృహసారథుల శిక్షణ

బొబ్బిలి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న గృహసారథుల శిక్షణా కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ 3వ తేదీన తెర్లాం మండలంలో పార్టీ కార్యాలయం, 4న బాడంగి మండలం కళ్యాణమండపం, 5న రామభద్రపురం మండలం పార్టీ కార్యాలయం, 6న బొబ్బిలి మండలం పార్టీ కార్యాలయం, 7న మున్సిపాలిటీ పార్టీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాలకు కొత్తగా నియమితులైన గృహసారథులంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాతాళభైరవి చిత్ర యూనిట్ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాతాళభైరవి చిత్ర నటీనటులు

రాజాం: పట్టణంలో పాతాలభైరవి చిత్ర యూనిట్ గురువారం బైక్ ర్యాలీ నిర్వహించింది. కంచరాం నుంచి శ్రీకాకుళం రోడ్డు మీదుగా సీతారామ థియేటర్ వరకు చిత్రంలోని నటీనటులు బైక్ ర్యాలీ చేశారు. ఈ నెల 3వ తేదీన రాజాంలోని సీతారామ థియేటర్‌లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఇలా ర్యాలీ చేసినట్లు డైరెక్టర్ శ్రీకరబాబు, ప్రొడ్యూసర్ పీవీజీ కృష్ణంమాస్టర్ తెలిపారు. ర్యాలీ అనంతరం స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులుతో చిత్రబృందం కలిసి సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

5న అభయాంజనేయ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలిలో ఈ నెల 5వ తేదీన అభయాంజనేయ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్టు యువసంకల్ప అసోసియేషన్ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు శాంతి కల్యాణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ధాన్యం బిల్లుల చెల్లింపులపై ఆరా



మండాకురిటి ఆర్‌బీకే పరిశీలనలో ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలో మండాకురిటి, సురవరం, సిరిపురం గ్రామ రైతు భరోసా కేంద్రాలను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి గురువారం సందర్శించారు. అనంతరం ధాన్యం బిల్లుల చెల్లింపులపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను ఆరాతీశారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు సోమరాజుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

ఉపాధి పనులు ప్రారంభించండి



మాట్లాడుతున్న హరనాథరావు

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు ఆదేశించారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన ఇప్పటికే 15 పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన పంచాయతీల్లో కూడా పనులు చేయించాలన్నారు. వేతనదారులు వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి పనులు చేసుకుంటే రూ.257 వేతనం వస్తుందని అవగాహన చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.